# మారింది కాలమా... మనమా?

- లక్ష్మీరంగరాజన్

ఇంకో పదిరోజులుంది పెళ్ళికి. రేణూ ఈరాత్రి అమెరికా నుంచి వస్తుంది. "కాస్త ముందుగా రావే" అంటే "అలా ఇష్టం వచ్చినట్లు రావడానికి ఇది ఇండియా కాదు. ఉద్యోగం పోతుంది. అయినా ముందుగా వచ్చి ఏం చేయాలి. అన్నీ రెడీమేడ్‌గా దొరికే ఈరోజుల్లో ఎందుకమ్మా టెన్షన్ పడతావు. డబ్బు పారేస్తే క్షణాల మీద కావలసినవి మన కళ్ళముందుండే ఈ కంప్యూటర్ యుగంలో నీలా టెన్షన్ పడేవాళ్లని చూస్తే ఆశ్చర్యంగా ఉంది. ప్లీజ్ అమ్మా! కూల్‌గా ఉండు" ఫోనులో రేణూ మందలింపులు, సలహాలు.

అయినా ఎందుకో కూతురు పెళ్ళి అనగానే తెలియని ఓ ఆరాటం, దిగులు.

బాగా జరగాలనే తపన. వియ్యాలవారు మంచి వాళ్ళుగానే ఉన్నారు. అయినా పెళ్లి అనగానే ఆటోమేటిక్‌గా చిన్నచిన్న మనస్తాపాలు రావనే గ్యారంటీ ఏమిటి? క్రిందటి వారం ఫోన్‌లో అబ్బాయి తల్లి "పిల్లకి పెద్ద జరీ అంచులో చీరలు తీయండి, ఆడపడుచుకి అలానే తీసెయ్యండి" అని చెబుతూ "మీరు ఈపాటికి తీసి ఉంటారు, నేను చెప్పక్కర్లేదు అయినా.." అంటూ నసిగింది. అందుకే నాకు కాస్త టెన్షన్‌గా ఉంది.

★ ★ ★

ముప్ఫై ఏళ్ల క్రితం తన పెళ్ళి గుర్తుకు వచ్చింది. మధ్య తరగతి కుటుంబం. ఇద్దరమ్మాయిలు, అబ్బాయి. నాన్నగారు గవర్నమెంట్ ఆఫీసులో సీనియర్ క్లర్క్. అందర్నీ చదివించి పెళ్ళి చేయడం అన్నది సామాన్య విషయం కాదు. పాపం నాన్న, అమ్మ పొదుపుగా డబ్బులు ఖర్చు పెట్టి ఆదా చేసి పెళ్ళిళ్ళు బాగానే చేశారు. అది కావాలి, ఇది కావాలి అని అడగడానికి నోరు వచ్చేదికాదు మాకు. ఆ రోజులే వేరు. ఈరోజులే వేరు. చేతినిండా డబ్బు. తన పెళ్లికి నెలముందునుంచే ఒక్కొక్కటీ కొనడం మొదలుపెట్టారు. అన్నీ ప్లాన్ వేసుకుని, పొదుపుగా చేసేవారు. పాపం అమ్మ తనకు పట్టుచీర వద్దని, ఆ డబ్బు కూడా తనకోసమే ఖర్చుపెట్టింది. అత్తారింట్లో అందరూ మెచ్చుకునేలా నీవూ, నీ చీరలు ఉండాలి అని మరీ చూసి చూసి కొన్నది. తలచుకుంటే, ఇప్పటికి కంటి చివర నీరు కారుతుంది. ఇప్పుడేమో రేణూ "పెళ్ళి ఖర్చులకి వెనకాడవద్దు, కావల్సింది నేనిస్తాను" అని వాళ్ళ నాన్నకి ఫోన్లు చేస్తుంది. కాలం ఎలా మారింది. అమ్మా నాన్నా ముందు నిలబడి మాట్లాడేందుకే ధైర్యం చాలేది కాదా రోజుల్లో. ఇప్పుడేమో వాళ్ల అమ్మా,నాన్నలని నడిపిస్తున్నారు. మారింది మనమా, కాలమా?

★ ★ ★

రేణూ వచ్చేసింది. వచ్చీరాగానే "అమ్మా! సారీ నేను జుట్టు ట్రిమ్ చేసుకున్నాను. ఈ మాత్రం జుట్టు చాలులే పూలజడలేసుకోవడానికి" అంది.

నాకైతే ఏడుపొచ్చేసింది.

బారెడు జడని, మూరెడు చేసేసింది.

"ఎలా మనసు వచ్చిందే!"

"ఏంచేయనమ్మా! మెయిన్‌టైన్ చేయలేకపోయాను. సారీ చెప్పానుగా"

"ఇంతటితో ఆ టాపిక్ వదిలెయ్యి" అనేసింది తేలిగ్గా.

అత్తయ్య, ఆడపడుచులు "పోనీలేవే. పెళ్ళికి ముందు దాంతో వాదనెందుకు? సవరం పెట్టి జడ వేద్దాం" అని నచ్చజెప్పి నా నోరు మూయించారు.

ఇలాగే ఒక్కోదానికి మనం సర్దుకుపోయి, వాళ్ళ దారిన వాళ్లని వదిలెయ్యడం వల్లనే అంతా మారిపోతోంది. ఇలాగే ఒక్కోదానికి అడ్జస్ట్‌మెంట్. గోరింటాకు పెట్టుకోమంటే అదేదో అరబిక్ మెహందీ డిజైన్ అట. పెళ్ళికి మోచేతులు దాకా, కాళ్ళపైన ఏమిటో రాసుకున్నట్లు వేసుకుంది.

దానికో వేలదాకా ఖర్చు. చేతినిండా నల్లగా గీతలు గీసినట్లు ఉంది. ఎంచక్కా ఏపుగా పండే గోరింటాకు అందం ఇందులో ఉందా! "కాస్త ఈ వారంరోజులు చీర కట్టుకోవే" అంటే "పెళ్ళయితే ఎలాగో ఓ నెలరోజులదాకా ఆ వేడుకలు, ఈ వేడుకలు అంటూ నా ప్రాణం తీస్తారు. ప్లీజ్ బామ్మా, నాన్న, మీరైనా అమ్మకి చెప్పండి. ఈ కాలంలో కూడా నీలాంటి వాళ్ళుంటారా అసలు అబ్బాయి



తల్లే చాలా మోడర్న్‌గా ఉంది. నీకంటే పెద్దది. నీవేమో ఇంకా ఆ తరంలా ఉంటావు అమ్మా" అని విసుక్కుంది.

"నా మాటలు ఇప్పుడు అలాగే అనిపిస్తాయి. నువ్వే తెలుసుకుని, ఏదోనాడు చెప్తావు ఓల్డ్ ఈజ్ గోల్డ్ అని. ఈ మార్పులు, చేర్పులు క్షణకాలమే తెలుసా!" అనేసి ఊరుకున్నాను.

రేణూ పెళ్ళయిపోయింది. భగవంతుడి దయ వల్ల అంతా బాగా జరిగింది. చలాకీగా ఉండే రేణూని అందరూ తెగ మెచ్చుకున్నారు. చిన్నప్పట్నుంచి అది కాస్త వాగుడుకాయే. "పెళ్లయితే మాటలు తగ్గించాలి" అని నేనూ, అత్తయ్యా అన్నప్పుడే "అది మీకాలం. ఈ రోజుల్లో మూగదానిలా ఉంటే బాగోదు. అతిగా వాగినా నా లిమిట్స్ దాటనమ్మా. మీకు తలవంపులు తీసుకురానమ్మమ్మా" అంటున్నప్పుడు పోనీలే అంతగా చెబుతుందిగా జాగ్రత్తపడుతుందిలే అని ఊరుకున్నాం.

అందునా రేణూ మామగార్కి తనంటే పల్లమాలిన అభిమానం.

"రియల్లీ రేణూ ఈజ్ ఏ స్వీట్ గర్ల్, అండ్ వెరీ వెరీ యాక్టివ్" అంటూ పదే పదే అంటున్నప్పుడు వాళ్ళ నాన్నకి చెప్పలేనంత సంతోషం.

కళ్లల్లో కాస్త గర్వం కూడా కనపడింది.

కష్టపడి చదివి, మెరిట్‌లో కంప్యూటర్‌లో ఇంజనీర్ అయి ఈనాడు అమెరికాలో నెలకు లక్షలు సంపాదిస్తోంది.

అందరికీ అన్నీ చేస్తోంది. పిన్ని, బాబాయి, అత్తయ్య, మామయ్యలకి, పిల్లలకి తన వల్ల అయిన హెల్ప్ చేసింది.

క్రిందటి నెల అత్తకూతురి పెళ్ళికి డాలర్లు పంపి సహకరించింది.

పైకి చిటపటలాడినా మనసు నిండా ప్రేమాభిమానాలున్నాయి. అది చాలు కాకపోతే తన పంతమే నెగ్గాలనే మొండిది. అది కాస్త సర్దుకుంటే బాగుంటుంది.

అబ్బాయితో చీటికి మాటికీ దెబ్బలాడకుండా ఉంటే అదిచాలు.

ఈకాలంలో ఇలాంటి చిన్న చిన్న గొడవతో విడాకులు దాకా వెళ్తున్నాయి.

పెళ్ళయ్యి ఆర్నెళ్ళు తిరక్కుండానే డైవర్స్‌కి అప్లై చేసిన సంఘటనలు వినవస్తున్నాయి. అబ్బాయిని చూస్తే చాలా మెతకగా ఉన్నాడు.

రేణూని అర్థం చేసుకుంటే సరి. పెళ్ళి వేడుకలు ఒక్కటి కూడా తగ్గించలేదు వాళ్ళు.

అన్నీ సవ్యంగా అడిగి జరిపించుకున్నారు. ఏమిటో కాలం మారింది అంటూ అంటున్నామే, ఇంకా ఆనాటి సంప్రదాయాల మీద, ఆచారాల మీద నమ్మకాలుంచి జరుపుకుంటున్నారనే చెప్పాలి. బ్యూటీపార్లర్‌కి వెళ్ళి డ్రెస్ చేసుకొచ్చింది. దానికో ఖర్చు. ఏమిటో ముఖం మారిపోయింది. మొదటిరోజు మేకప్ ఎక్కువైందని వీడియోగ్రాఫర్ చెప్పగానే రెండో రోజు తగ్గించేసింది. పైగా చీర కట్టడానికి డబ్బులు.


ఆరోజుల్లో అమ్మ, బామ్మలు తనని కూర్చోబెట్టి, గంటలు కష్టపడి ఎంత బాగా పూలజడ వేసిందో, రెండోరోజు దాకా ఊడలేదు.

రేణూకి పెళ్లయ్యేలోపు జడ వదులై జారిపోయేలా అయ్యింది.

దానికో మనిషి పక్కనే ఉండి సరిచేయాల్సి వచ్చింది.

సాయంత్రం రిసెప్షన్‌కి జుట్టంతా విరబోసి ఏమిటో ఆ స్టయిల్. పెద్దవాళ్ళే నోరుమూసుకున్నప్పుడు తనేం చెప్పగలదు. పైగా జుట్టు ముఖం మీద, కళ్లమీద పడడం, అది సరిచేసుకోవడానికే సరిపోయింది.

ఆ తర్వాత ముఖం కడిగి జుట్టు సరిచేసే సరికి తలప్రాణం తోకకి వచ్చింది.



ఏమిటో కాలం మారిందా, మనం మారామా? విజ్ఞానరంగం అన్నిటా ముందంజ వేయడం వల్ల మనల్ని మనమే మార్చుకుని నేరాన్ని కాలంపై నెట్టు తున్నామా?

మనసు లోతుల్లో, ఇంకా సంప్రదాయాల మీద, ఆచారాల మీద కాస్త నమ్మకాలు, భయం ఉండబట్టే అడ్జస్ట్ అవుతూ జరిపిస్తున్నాం. లేదంటే అంతా ఇంకా విచ్చలవిడిగా విహరించరా!

పెళ్ళిలో కాస్త కుదురుగా కూర్చోవే అంటే పీటల మీద కూర్చుని వచ్చే పోయే ఫ్రెండ్స్‌ని హాయ్ అంటూ పలకరించడం, చేతులెత్తి ఊపడం, మధ్యమధ్యలో సెల్‌ఫోన్ మాటలు, ఏమిటో అంతా విచిత్రంగా ఉంది. అబ్బాయి తల్లి ఇవేమీ పట్టించుకోలేదు.

హాయిగా, జాలీగా ఉంది. తనే ఇంకా మారలేదా! తనకూతురి కోసమైనా మారాలా వద్దా!

పెళ్ళయి రేణూ వెళ్ళిపోయింది.

## అపకారం

"ఉపకారికి అపకారం చేయడమంటే ఏమిట్రా?" రమేష్‌ని అడిగాడు టీచర్.

"మేమిచ్చే ఫీజులతోనే మీరు జీతాలు తీసుకుంటూ మమ్మల్నే కొట్టడం" కోపంగా గొణుక్కున్నాడు రమేష్.

## పోలిక

"నన్నెప్పుడూ మీరు పరమపదసోపానం అని పిలుస్తారెందుకు?" గోముగా అడిగింది భార్య.

"ఏమ్మంటీ.. కష్టపడి పైసా పైసా కూడబెట్టి నేను పైకెదగాలనుకుంటుంటే నువ్వేమో గొంతెమ్మ కోరికలతో పాములా నన్ను క్రిందకు తోసేస్తావు కాబట్టి" కోపంగా అన్నాడు భర్త.


-కె.చంద్రకళ (చెన్నై)

## గురక

ఏడుస్తున్న మనమరాలిని చూసి అత్తగారు కోడలితో "ఏదైనా జోల పాట పాడుతూ పాపని నిద్ర పుచ్చకూడదూ?" అంది.

"వేరే జోలపాట ఎందుకులెండి. మీ అబ్బాయి పెట్టే గురకే జోలపాటలా పని చేస్తుంది. ఆయన ఇప్పుడేగా నిద్ర పోయారు. ఇక పాపని ఆయన పక్కన పడుకోబెడితే సరిపోతుంది."

-టి.లక్ష్మి (విశాఖపట్నం)




ఇప్పుడే చదువూ, ఉద్యోగం అంటూ అయిదారేళ్ళు తనని వదిలే ఉంటోంది తను.

తనమీద ప్రేమ ఉందా లేదా!

మాటిమాటికీ తను తిట్టడం వల్ల తన మీద కోపమా, ద్వేషమా, ఎప్పుడూ నాన్న జట్టే తను.

తనూ, అత్తగారే రేణూని మందలించేవారు. ఇప్పుడిప్పుడు అత్తయ్య కూడా మానేసింది.

"కాలం మారింది సుధా! వాళ్ల మానాన వదిలెయ్యి. మనరోజులు వేరు. ఈరోజులు వేరు. మంచి చెడ్డలు వాళ్ళే తెలుసుకుంటారు" అని సమాధానపరచేది.

"పైగా నీవూ, నేనూ ఎంత బావుకున్నా వాళ్ళు మారరు...ఊరుకో" అనేది.

అదేంటో తన బుర్రకి ఎక్కేది కాదు. చదవనీ, సంపాదించనీ వద్దనలేదు. కానీ మరీ స్వేచ్ఛగా, ఎవరినీ లక్ష్యం చేయక మాట్లాడడం, ప్రవర్తించడమే బాగాలేదు.

తన మనసుని తొలచిన మరో విషయం తన స్నేహితురాలు లలిత కోడలు పెళ్ళికి వచ్చింది.

మెడలో ఓ చిన్న నెక్లెస్ మాత్రమే ఉంది. నల్లపూసలు, తాళిబొట్టు లేదు. తరచి తరచి చూశాను. కనిపించలేదు.

పైగా పెళ్ళికి చక్కగా పట్టుచీర కట్టుకుని రాకుండా రంగు వెలసినట్లున్న ఓ ఖరీదైన చుడీదార్‌తో వచ్చిందట.

లాగి చెంపమీద కొడదామనిపించింది. మరీ ఇంతలా బరితెగించాలా "లలితా కాస్త నీకోడలికి చెప్పరాదా!" అంటే "మీకొడుకేమీ అనలేదు మీకేంటీ మధ్య" అంటుంది.

ఏం చేయనే వాళ్ళు బాగుంటే అది చాలు. మధ్యలో నాకెందుకని ఊరుకున్నాను అంది.

మరీ అంతలా పిల్లలకి సాయపడాలా! ఏమిటో చోద్యంగా ఉంది సుమా! రేణూకి ముందే, నేనూ, బామ్మ కూర్చోబెట్టి అన్నీ వివరించి చెప్పాం.

"అమ్మా! నన్ను మరీ ఇంత చీప్‌గా చూడకమ్మా! నాకు తెలుసు. మరీ అంతలా వాటిని తీసిపారెయ్యనమ్మా! వాటి విలువలు నాకు తెలుసమ్మా" అని ఏడ్చింది.

నా మనసు చల్లబడింది అప్పుడు.

చదువులు వేరు, జీవితం వేరు.

పెళ్లి అనేది హార్ట్ ఆఫ్ లైఫ్ అనుకోవచ్చు. కానీ పెళ్లితోనే ప్రతి ఆడపిల్ల జీవితం మారేది, స్థిరపడేది. ఏమిటో మనమే మన పిల్లల్ని సరిగా పెంచడం లేదు.

మనం ఏమీ అనుభవించలేదని, మన పిల్లలు అనుభవించనీ అన్నట్లు స్వేచ్ఛనిచ్చి పెంచడం మనం చేస్తున్న పెద్ద తప్పు అనుకుంటాను.

రేణూ పెంపకంలో అలాటి తప్పు జరగరాదని నేను ఎంతో జాగ్రత్తపడ్డాను.

స్వేచ్ఛనిచ్చినా, అక్కడక్కడ లక్ష్మణరేఖ గీసి దాన్ని దాటకుండా చేసేదాన్ని.

అప్పగింతలప్పుడు రేణూ కళ్లల్లో కనిపించిన ఆ పల్చటి కన్నీటి తెర, తన కన్నీటి తెరకి ఆనకట్ట వేయక పెల్లుబికేలా చేశాయి.

"అమ్మా! ప్లీజ్ ఏడవకు" అని తనని వాటేసుకుని చెవిలో గుసగుసలాడింది.

ఆరోజేమంది "నేనేమీ ఏడవను, నిన్ను వదిలి అయిదారేళ్ళుగా హాస్టల్ లోనూ, అమెరికాలోనూ ఒంటరిగా ఉండి అలవాటుపడ్డాను. ఏడుపురాదమ్మా" అంది.

ఇప్పుడేమో ఏడుపుని ఆపుకోవడానికి విశ్వ ప్రయత్నం చేస్తోంది. అదే సృష్టి రహస్యం.

ప్రతి ఆడపిల్లా ఎంత చదివినా, ధైర్యవంతురాలైనా కన్నవాళ్ళని వదిలి వెళ్లేటప్పుడు కంటతడి పెట్టుకోక తప్పదు మరి. కాలం మారిందా! మార్చిందా! లేదే.

★ ★ ★

రేణూ అత్తవారింటికి బెంగుళూరు వెళ్ళిపోయింది. రెండువారాలుండి ఆ తర్వాత అబ్బాయి, అల్లుడు అమెరికా వెళ్ళిపోతారు. ఆ తర్వాత రెండేళ్లకి వస్తారో ఏమో!

ఇన్నాళ్ళ రేణూ వేరు. ఇప్పటి రేణూ వేరు.

ఎలా ఉందో ఏమో అత్తవారింట్లో. రోజూ ఫోన్ చేయమంది. ఈరోజింకా ఫోన్ రాలేదు.

అమెరికాలో జుట్టు విరగబోసుకున్నా, ప్యాంట్, షర్ట్, షాట్స్ వేసుకున్నా ఫర్వాలేదు.

అత్తారింట్లో చక్కగా జడవేసుకో, చీరకట్టుకో. మీ అత్తగారు పైకి అలా ఉంది గానీ లోలోపల మనిషి చాలా జాగ్రత్త సుమా! అని మందలించి పంపించింది.

పెళ్ళిలో కూడా అది వద్దు, ఇది వద్దు అని పైకి అన్నా కావాలన్నట్లు అడిగి చేయించుకుంది.

ఆడపడుచు లాంఛనాలు తగ్గరాదని చెప్పింది. ఆరోజుల్లో నిక్కచ్చిగా అడిగేవారు.

ఇప్పుడేమంటే అభినందించుకుంటూ బహుమతుల పేరిట, ఒకరికొకరు ఇచ్చుకుంటున్నారు అదే తేడా.

డబ్బు చెలామణీ బాగా ఉందిప్పుడు. ఆరోజుల్లో 'వెయ్యి రూపాయలు' అంటే నోరు తెరచి చూసేవారు.

ఇప్పుడేమో అందరి మాటల్లోనూ లక్షలు దొర్లుతున్నాయి.

రేణూ ఫోన్ వచ్చింది.

"అమ్మా! ఎలా ఉన్నావు. నీవన్నది ముమ్మాటికీ నిజం. నేను రోజు చీర కట్టుకుని జడ వేసుకోవడం, ఇంట్లో అందరికీ బాగా నచ్చింది. పైగా బామ్మ అదే ఆయన బామ్మ నాకు రోజూ దిష్టి తీస్తోంది తెలుసా. మా అత్తగారు "రేణూ నీవు చీరలోనే అందంగా ఉన్నావు. నీకు చాలా నప్పింది'' ఆయనకి చీరకట్టుకుంటేనే ఇష్టం అన్నారమ్మా.

నీమాటలు తీసిపారేసాను గానీ నువ్వన్నట్లు కాలం మారలేదమ్మా, మనమే మారుదామా, వద్దా అనే మీమాంసలో ఉన్నాం. పైగా ఇంకోమాట అన్నారు తెలుసా నీ గురించి. "వయసుకు తగ్గట్లు మీ అమ్మ డ్రెస్ చేసుకుంది. చూడగానే చేతులెత్తి దణ్ణం పెట్టాలనిపిస్తోంది. చిరునవ్వుతో అందర్నీ పలకరించడం, ఇంకా మా కళ్లముందే ఉంది. ఆ నవ్వే మీ అమ్మకి నిండుదనాన్ని, అందాన్ని ఇస్తుంది.

ఆవిడ పెంపకం కాబట్టే నీవు అణకువ, వినయ విధేయతలతో ఉన్నావు. ఈ కాలంలో ఇలాంటి అమ్మాయిల్ని చూడడం చాలా అరుదు సుమా!'' అని అనగానే నన్ను నేనే గిల్లుకుని చూసుకున్నాను. కలా నిజమా! అని నీలాంటి అమ్మ దొరికినందుకు చాలా గర్వంగా ఉందనమల్మా. నీవు బామ్మ, ఆ రాత్రి నాకు చేసిన గీతోపదేశం పరమార్ధం ఇదే సుమా అని తెలుసుకున్నాను. థ్యాంక్యూ వెరీమచ్ అమ్మా! బామ్మకు చెప్పు. వచ్చే ఆదివారం ఇక్కడ్నుంచే మేం అమెరికా వెళ్ళిపోతాం.

నువ్వు నాన్న వస్తారుగా. అమ్మా నిన్ను చూడాలని ఉందమ్మా. ఇన్నాళ్ళు నాకనిపించలేదు. ఇప్పుడెందుకో నీ ఒళ్లో పడుకుని ఏడవాలని ఉందమ్మా..ప్లీజ్'' రేణు గొంతు బొంగురుపోయింది.

"అమ్మా రేణూ! చెప్పురా. నిన్ను బాగా చూసుకుంటున్నారుగా. అదేకావాలి మాకు. నేను నాన్న వస్తాం. నీకేంకావాలో చెప్పు తెస్తాం'' అన్నాను.

"నాకేం వద్దమ్మా నిన్ను చూస్తే చాలు. ఈరోజూ నేనూ ఆయన తిరుపతికి వెళ్తున్నాం. వెళ్ళి వచ్చాక ఫోన్ చేస్తాను. ఉంటాను మరి'' అంటూ ఫోన్ పెట్టేసింది.

'అవున్రా రేణూ!కాలం మారలేదు. మనమే మారాలని విశ్వప్రయత్నం చేస్తున్నాం. మనం ఎంత ఎత్తుకెదిగినా, రెక్కలుడిగిననాడు చివరికి చేరాల్సింది మన జన్మభూమికే కదా. మన అలవాట్లని, అభిరుచుల్ని ఈ యాంత్రిక యుగానికి తగ్గట్లు మార్చుకుంటున్నాం.

దానివల్ల మనం నష్టపోతోంది చాలా. మనల్ని మనమే మోసగించుకుంటున్నాం. కొత్తొక వింత, పాతొక రోత అంటున్నాం గానీ ఓల్డ్ ఈజ్ గోల్డ్ ఎప్పటికీ. మనమే మన సంప్రదాయాల్ని, సంస్కృతిని మంటగలిపి పాశ్చాత్య నాగరికతా వ్యామోహంలో వాటి విలువల్ని తెలుసుకోక దిగజారిపోతున్నాం. అంతా కలికాల మహిమ అంటూ దాటేస్తున్నాం. జీవనచక్రం తిరిగి తిరిగి మళ్ళీ మొదటికి వస్తుంది. పాతసీసాలో కొత్త సారా అన్నట్టు మళ్లీ ఆ రోజులు రాకపోవు.



## నిజమా?

తారలు చాలా కొన్ని ప్రశ్నలకే నిజం అని చెబుతారు. నమ్రతా శిరోద్కర్ ఇప్పుడు ఇలాంటి సమాధానమే చెబుతోంది. మహేష్ మంజ్రేకర్‌తో కలిసి తిరుగుతున్నావని బాగా పుకార్లు వస్తున్నాయి కదా? అంటే అది నిజమే అని ఘంటాపథంగా చెబుతోంది. అసలు సంగతేంటంటే మహేష్ రూపొందించిన అస్తిత్వ, వాస్తవ్ చిత్రాల్లో నటించిన నమ్రతా ఇప్పుడు మరికొన్ని చిత్రాల్లో కూడా నటిస్తోంది. తనకి మంచి ఆఫర్లు ఇచ్చినవారితో స్నేహంగా మెలిగితే తప్పేంటి? అని ఎదురుప్రశ్న వేస్తోంది.



నాకా నమ్మకం ఉంది'

* * *

రేణూ, అల్లుడు అమెరికా వెళ్ళిపోయారు.

నెలరోజులై పోయింది. చాలా హేపీగా ఉంది రేణూ. ఆయనెంత మంచి వారో తెలుసా!


నేనంటే తగని ప్రేమ అనుకో. నాకోసం ఏమైనా చేస్తాను అంటారమ్మా. నాలా అంతలా మాట్లాడరు గాని ఒక్క మాట మాట్లాడినా అందులో ఎంతో పరమార్థం ఉంటుందిత తెలుసా అని ఒకటే పొగడ్తలు. వారానికోసారి ఇంటర్నెట్‌లో ఫోటోలు పంపిస్తుంది. అది చాలు అని సరిపెట్టుకున్నాను. కాస్త అల్లుడికి కూడా నా మెంటాలిటీనే. ఆచారాలు, సంప్రదాయాలపై నమ్మకం ఉంది.

వాళ్ల ఇంటి అలవాట్లు, పెద్దల పట్ల మర్యాద, గౌరవం అన్నీ ఉన్నాయి.



## సత్తా చూపిస్తా

నటనలోకి వచ్చి పదేళ్ళయిందని చెప్పే పొడుగుకాళ్ళ సుందరి శిల్పా షెట్టి తన సత్తా చూపిస్తానంటోంది. ఫిర్‌మిలెంగె చిత్రం ద్వారా జనం ముందుకి వచ్చిన శిల్ప ఆ చిత్రం తనకి మంచి పేరు తెచ్చిందంటోంది. ఈ చిత్రంతో పాటు ఆమె ఖ్వామోష్, గర్వ్ చిత్రాల్లో నటిస్తోంది. చాలాకాలం పాటు నటనకి, పత్రికలవారికి దూరంగా ఉన్న శిల్ప ఆ దూరం తనలో పట్టుదలని పెంచిందంటోంది. ఆ పట్టుదలతో ఆమె ఏం సాధించనుందో చూద్దాం.




ఒక్క చెడ్డ అలవాటు లేదు. "ఆంటీ త్వరలోనే ఇండియాకొచ్చి సెటిలై పోతాం" అని అల్లుడు అన్నప్పుడు నేను నమ్మలేదు.

ప్రతివాళ్లు అమెరికా వెళ్ళేముందు అనే డైలాగ్ ఇదే కదా అని సరిపెట్టుకున్నాను.

పైగా నా కూతురు "అమ్మా! నిన్ను పిలిపించుకుంటాను అమెరికాకు. రెడీగా ఉండు" అనేసి వెళ్ళిపోయింది. ఏమిటో! అనుకున్నాను.

నెలతర్వాత రేణూ దగ్గర్నుంచి పెద్ద లెటర్ వచ్చింది.

"ప్రియమైన అమ్మకి!

ఎలా ఉన్నావమ్మా! నేనూ, ఆయన బాగున్నాం. నీకో సంతోషకరమైన వార్త. వేరే ఏదో ఊహించుకోకు. నేనూ ఆయన త్వరలో ఇండియాకొచ్చి సెటిలవ్వబోతున్నాం. ఆయన నాతో ఆ మూడు రాత్రులనాడు ఏమన్నారో తెలుసా! రేణూ అమెరికాలో ఉండాలని ఉందా, ఇండియా రావాలని ఉందా, ఎందుకంటే నేను ఇండియాలోనే స్థిరపడాలని నిశ్చయించుకున్నాను. కావలసినంత సంపాదించాను. అమ్మానాన్నకి అన్నీ చేశాను. చెల్లి పెళ్ళి గ్రాండ్‌గా చేశాను. అమ్మ నాన్నతో కూడా మాట్లాడాను నీ ఇష్టం అనేశారు. మీ పేరెంట్స్‌ని, ఆ తర్వాత మా పేరెంట్స్‌ని అమెరికాకి పిలిచి అంతా చూపిద్దాం. ఆ తర్వాత ఇండియా వెళ్ళిపోదాం. చేతినిండా డబ్బుంటే మన ఇండియాకు ఏదీ సాటిరాదు. ఆ ప్రేమలు, అభిమానాలు, అలంబనలు ఇండియాలోనే చూడగలం అన్నారాయన. ఈ రెండు నెలల్లో ఆయన నామీద చూపెడుతున్న ప్రేమని రాతల్లో చెప్పలేను. అన్నీ చేసి పెడతారు. నా మీద అంత ఇది ఆయనకి. నేను రావడం కాస్త లేటయితే నాకోసం వెయిట్ చేస్తారు. పైగా నేను బెంగుళూరులో ఉన్నప్పుడు ఉదయాన్నే నన్ను లేపి వాళ్ల అమ్మగారికి సాయం చేయమనేవారు. నేను ఆమె పక్కనే నిలబడేదాన్ని. దానికే ఆవిడ తెగ సంబరపడిపోయేది. నీలాగే ఆయనకి మన సంప్రదాయాలు, ఆచారాల మీద నమ్మకం ఎక్కువ. నేనిప్పుడు చాలా మారానమ్మా! నువ్వే చూస్తావుగా. మంగళ, శుక్రవారాలు చీరకట్టుకునే ఆఫీసుకు వెళ్తున్నాను. ఆయనకి అలా ఉంటేనే ఇష్టం. నాకోసం ఎన్నో చేస్తున్న ఆయన కోసం నేను మారకపోతే ఎలా అమ్మా!" లెటర్ చదివి తృప్తిగా నిట్టూర్చాను.

ఎంతైనా ఈకాలపు పిల్లలకి అన్నిటా అవగాహన ఉంది. తరాల మధ్య అంతరాలు వాళ్లనలా సందిగ్ధావస్థలో ఉంచుతోంది. మనమే తప్పుగా అంచనా వేస్తున్నాం.

కాలమూ మారలేదు, మనమూ మారలేదు. క్షణికావేశాలు, వ్యామోహాలు, స్వేచ్ఛ, చదువులు పొగమంచులా తరాలమధ్య నిలిచి ఒకరికొకర్ని కనుమరుగుచేస్తున్నాయి.

అంతేమరి. చదువు, విజ్ఞాన వికాసం, మన సంస్కృతిని, సంప్రదాయాల్ని గట్టిపరచాలి గాని అడుగంటనీయకూడదు. నాకెందుకో గర్వంగా ఉంది నా అల్లుడి మనసు తెలిశాక. వెంటనే వెళ్లి అత్తగారికి, ఆయనకి ఈ విషయం చెప్పాలి.

వాళ్ల రాకకోసం మనసు ఉవ్విళ్ళూరసాగింది. నా రేణూ మారింది అది చాలు.

"అమెరికాలో స్థిరపడాలి, నువ్వు నాన్న వచ్చేయండి" అని పదేపదే అనే రేణూయేనా ఇలా అల్లుడికి లొంగిపోయింది. అల్లుడు తెలివైనవాడే. దాని దారిలోనే వెళ్ళి తన దారికి మళ్లించాడు. అమెరికా అబ్బాయి కావాలని, పట్టుపట్టి పెళ్లి వాయిదావేస్తూ వచ్చిన రేణూకి అమెరికా అల్లుడు దొరికినా అమెరికా వెళ్ళి ఇండియా రిటర్న్ కాబోతోంది.

వెంటనే వెళ్ళి రేణూని హత్తుకుని ముద్దుపెట్టుకోవాలని అనిపించింది. కుదరదే గబగబ లేచి వెళ్ళి రేణూ ఫోటో తీసి మనసారా ముద్దుపెట్టుకుని గుండెలకి హత్తుకున్నాను నేను కనుకొనలో కన్నీరు జారగా.

★